క్లుప్తంగా

నేటి నుంచి శిక్షణ

పెద్దపంజాణి: మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 12వ తేదీ నుంచి వరుసగా మూడు రోజులు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నామని ఈఓపీఆర్ఆర్డీ శారదాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ పరిపాలన, అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన, పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిలైట్లు, ఎస్‌డబ్ల్యూపీసీ నిర్వహణ, పంచాయతీరాజ్ చట్టం..ఇత్యాది అంశాలపై మాస్టర్ ట్రైనర్‌తో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె తెలియజేశారు.

రెండు బైక్‌లు ఢీ ఇద్దరికి తీవ్ర గాయాలు

చౌడేపల్లె: మోటార్ సైకిళ్లు ఢీకొని ఇద్దరికి ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం మండలంలోని సింగిరిగుంట సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం..కలికిరికి చెందిన గోపి(21) బైక్‌లో చౌడేపల్లె వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొంది. ఈఘటనలో గోపికి తీవ్రగాయాలయ్యాయి. మరో మోటార్ సైకిలిస్టు సైతం గాయపడ్డాడు. స్థానికులు 108లో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తరలించారు.

ఉభయదారుల రచ్చ రచ్చ..!

- కరపత్రం పేరుతో గోల
- మర్యాద పాటించడం లేదని చిందులు
- తోపులాటకు దారితీసిన వాగ్వాదం

కాణిపాకం: కాణిపాకంలోని మణికంఠేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన ఉభయదారుల సమావేశం రచ్చరచ్చగా మారింది. కరపత్రంపేరుతో గోలగోలగా మారింది. ఆలయ మర్యాదలు పాటించడంలేదని చిందులేసింది. అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించింది. తర్వాత ఉభయదారుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. తీరా తోపులాటకు దారితీసింది. పోలీసులు రంగం ప్రవేశం చేసి వారిని సర్దుబాటు చేశారు. కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 7 నుంచి 21 రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ ఏర్పాట్లపై ఆలయ ఉభయదారులతో ఆలయ అధికారులు సమావేశం నిర్వహించారు. ఉభయ దారులు ఆలయ ప్రతిష్టను పెంపొందించే విధంగా ఆహ్వాన పత్రికలు ఉండాలని.. చిత్తు పేపర్లో ఆహ్వాన పత్రికలు ముద్రించడం ఏంటని ప్రశ్నించారు. వాహన సేవ నిర్వహించే వారి పేర్లు తదితర విషయాలను ముద్రించక పోవడం బాధాకరమైన విషయమని వాపోయారు. ఆలయ ఉభయదారులకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వడం లేదని నిలదీశారు. ఇది తమ ఆలయమంటూ అధికారులపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇక ఉభయదారుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో ఉభయదారులు ఒకరిపై ఒకరు తోపులాటలకు దిగి, దాడి చేసుకునే పరిస్థితి నెలకొంది. పరిస్థితి ఉధృతంగా మారింది. కాణిపాకం పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం ఆలయ ఈవో వెంకటేష్ మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 7వతేదీ నుంచి నిర్వహించే స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ప్రత్యేక సమావేశం నిర్వహించాం. వారి సలహాలు సూచనలు తీసుకోవాలని, ఈ బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు శేఖర్ స్వామి, 14 గ్రామాలు చెందిన ఆలయ ఉభయ దారులు పాల్గొన్నారు.

వైభవంగా బంగారక్కకు ఆడిపూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

గుడిపాల: మండలంలో వెలసిన బంగారక్క అమ్మవారికి వైభవంగా ఆదివారం ఆడిపూజలు నిర్వహించారు. వసంతాపురంలోని మహిళలందరూ ఊరేగింపుగా అమ్మవారికి పొంగళ్లను తీసుకెళ్లారు. ఉదయం ఉపవాస దీక్షలతో ఆలయానికి వెళ్లి అభిషేకంతో పాటు ప్రత్యేక అలంకరణ చేశారు. అక్కడే పొంగళ్లను పెట్టి మంగళవాయిద్యాల మధ్య పూజలు చేశారు. మహిళలు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులతో అమ్మవారికి మొక్కులను చెల్లించుకున్నారు.



పొంగళ్లను తీసుకువెళ్తున్న మహిళలు

బ్రహ్మానందాశ్రమంలో గీతాపారాయణం

బంగారుపాళెం: మండలంలోని మాధవనగర్‌లోని బ్రహ్మానందాశ్రమంలో ఆదివారం సాధువులతో గీతాపారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి వివిధ ప్రాంతాల నుంచి 16 మంది సాధుపుంగవులు మాధవనగర్ బ్రహ్మానందాశ్రమానికి వచ్చేశారు. ఆశ్రమ నిర్వాహకులు కేశవానందస్వామి ఆధ్వర్యంలో భక్తులు సాధుపుంగవులకు సాదరంగా ఆహ్వానం పలికారు. ఆశ్రమంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. గీతాపారాయణంలో భాగంగా శ్లోకాలను వల్లించారు. గీతాపారాయణంతో కలిగే మానసిక ప్రయోజనాలను వివరించారు.

గత ప్రభుత్వంలో సచివాలయాన్ని చూద్దాం..

గత ప్రభుత్వంలో గ్రామ పరిపాలన సౌలభ్యం కోసం ఉపాధి హామీ నిధులు రూ.40 లక్షలతో రెండతస్తుల సచివాలయాలను నిర్మించారు. 1200 అడుగులతో జీప్లస్1గా ఈ పనులను పంచాయతీరాజ్‌శాఖ పూర్తి చేసింది. ఇందులో కింది పోర్షన్‌లో నాలుగు గదుల పైన నాలుగు గదులను నిర్మించారు. వీటిల్లో మీటింగ్ హాలు, సర్పంచ్ గది, సంబంధిత శాఖలకు వేర్వేరు గదులను ఏర్పాటు చేశారు. ఇక కార్యాలయంలో రెండు కంప్యూటర్లు, రెండు సీపీయూలు, ఓ ప్రింటర్, యూపీఎస్, టేబుళ్లు, కుర్చీలు, బీరువాలను ఏర్పాటు చేశారు.

నేడు అన్న క్యాంటీన్ కోసం..

2018లో ఎన్‌సీసీ కన్‌స్ట్రక్షన్ కంపెనీ రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లను నిర్మించింది. పలమనేరులోనూ రూ.40లక్షలతో దీనిని నిర్మించారు. ఆపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో క్యాంటీన్ సేవలు ఆగిపోయాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతంలోని అన్న క్యాంటీన్‌కు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.13లక్షలతో మరమ్మతులు చేస్తున్నారు. ఇక్కడి భవనంలో వైరింగ్, ఫ్యాన్లు, లైటింగ్, ప్లాస్టింగ్, పెయింట్, నీటి సరఫరా మొదలైన పనులు మొదలెట్టారు. ఈ పనులను శివబాలాజీ కంపెనీ చేస్తోంది.





వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో శంకర్రాయలపేటలో నిర్మించిన సచివాలయం (ఫైల్), పలమనేరులో ప్రారంభానికి సిద్ధమైన అన్న క్యాంటీన్

అన్నా.. ఇదేందన్నా..?

- వీళ్లు చేస్తే మేలు...వాళ్లు చేస్తే వృధానా?
- గత ప్రభుత్వంలో రెండతస్తుల సచివాలయానికి రూ.40లక్షలు
- ఇప్పుడు 'అన్న క్యాంటీన్' మరమ్మతులకే రూ.13లక్షలు..!
- ఇది కూడా మున్సిపల్ సాధారణ నిధుల నుంచి వ్యయం
- అంతకు ముందు దీని నిర్మాణానికి రూ.40లక్షలు
- ఇదీ నాటి ప్రభుత్వానికి.. నేటి ప్రభుత్వానికి తేడా

పలమనేరు: చెప్పేవి శ్రీరంగనీతులు.. దూరేవి దొమ్మరి గుడిసెలు అన్న చందాన టీడీపీ మళ్లీ నాలుక మడత తిప్పేస్తోంది. గత వైఎస్సార్ సీపీ హయాంలో సచివాలయాల నిర్మాణం శుద్ధ దండగ అని, కేవలం ఆ పార్టీ నేతల జేబులు నింపుకోవడానికే ఇలా చేస్తున్నారని దుష్ప్రచారం చేసిన టీడీపీ ఇప్పుడు కూటమితో అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్ల నిర్మాణాలకు ఒక్కోదానికి రూ.40లక్షలు, గతంలో నిర్మించిన వాటికి మరమ్మతులకు రూ.13లక్షలు వెచ్చిస్తోంది! మేం చేస్తే ఒప్పు.. మీరు చేస్తే తప్పు అనేలా ఉంటోందీ వ్యవహారమని ప్రజలు వీరి తీరును బేరీజు వేస్తున్నారు. పలమనేరులో ఈనెల 15న అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించేలా గతంలో నిర్మించిన భవనానికే మరమ్మతులు చేస్తున్నారు. అది కూడా మున్సిపాలిటీ జనరల్ ఫండ్ నుంచి ఖర్చు చేస్తుంటం విమర్శలకు తావిస్తోంది. అసలే ఉద్యోగులకు, సిబ్బంది జీతాలకు ఇబ్బందిగా ఉంటున్న తరుణంలో మున్సిపాలిటీకి దీంతో గుదిబండలా తయారైంది.

తేడా ఏమిటంటే..!

రెండంతస్తుల సచివాలయానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.40లక్షలు వెచ్చిస్తే, ఇప్పటి ప్రభుత్వం అంతకుముందు టీడీపీ పాలనలో క్యాంటీన్ నిర్మాణానికి రూ.40లక్షలు వ్యయం చేసింది. అది కూడా గ్రౌండ్ ఫ్లోర్‌కు మాత్రమే! మళ్లీ ఇప్పుడు మరమ్మతులకు మరో రూ.13లక్షలు ఖర్చు చేసింది. అంటే మొత్తం మీద ఇందుకోసం రూ.53లక్షలైంది. గతంలో సచివాలయ నిర్మాణానికి పెట్టిన ఖర్చే ఎక్కువంటూ గగ్గోలు పెట్టిన టీడీపీ నేతలు ఇప్పుడు జరుగుతున్న క్యాంటీన్ల నిర్మాణాలపై ఏమంటారు? అప్పుడు కాంట్రాక్టర్ల కోసమే సచివాలయాల పనులని విమర్శించిన వారు ఇప్పుడు చేస్తున్న పనులు ఎవరికోసం? అని జనంలో చర్చ మొదలైంది. అది కూడా పట్టణ ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన డబ్బు నుంచి ఖర్చు పెట్టడం ఎంతవరకు సమంజసం? అనే మాట వినిపిస్తోంది.

కంటి వైద్య శిబిరానికి స్పందన





బైరెడ్డిపల్లెలో కంటి వైద్య పరీక్షలు వైద్యాధికారి మురళీకృష్ణ, పుంగనూరులో..

బైరెడ్డిపల్లె: స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. చెన్నై శంకర్‌నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 40 మందిని పరీక్షించి 28 మందిని ఆపరేషన్ నిమిత్తం ఎంపిక చేశారు. వారిని శంకర్ నేత్రాలయానికి తరలించి కంటి ఆపరేషన్లు చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. వారికి భోజన వసతి, మందులు, బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మురళీకృష్ణ, నిర్వాహకులు శ్రీనివాసులు, చిన్నబ్బ, చంద్రప్ప, రమణ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు: పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన లభించింది. లయన్స్ క్లబ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ పి.శివ శిబిరాన్ని ప్రారంభించారు. కుప్పం పీఈఎస్ మెడికల్ కాలేజీ వైద్యులు 70 మందికి వైద్య పరీక్షలు చేసి 8 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఎంపికైన వారికి ఉచిత రవాణా, భోజన సదుపాయాలతో ఆపరేషన్లు చేసి, కళ్లద్దాలు పంపిణీ చేయనున్నట్లు డాక్టర్ శివ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి, కార్యదర్శి సురేష్, ప్రతినిధులు గోపాలకృష్ణ, వరదారెడ్డి, కృష్ణమూర్తి, రాజేంద్ర, వేణుగోపాల్, అస్లాంబాషా, రెడ్డిప్రసాద్, సుబ్రమణ్యం, పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వేపచీర్ల తిరునాళ్లు



వేపచీరలు ధరించి ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

తవణంపల్లె: మండలంలోని దిగువమొదలపల్లెలో వెలసిన ఆరివేణి గంగమ్మ ఆలయంలో ఆడి మాసం సందర్భంగా ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో వేపచీర్ల తిరునాళ్లను జరుపుకొన్నారు. అమ్మవారికి, పుట్టకు భక్తులు పసుపు, కుంకుమ సుగంధ పుష్పాలతో అలంకరించి ధూపదీపనైవేద్యం సమర్పించారు. భక్తులు శరీరంపై దుస్తులు, ఆభరణాలు తీసివేసి నిలువునా వేపాకునే చీరగా ధరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు పశువులకు కూడా వేపాకు అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.

కత్తిరింపులతో అధిక దిగుబడి

- యాజమాన్య పద్ధతులు పాటిస్తే మామిడిలో ఆదాయం
- రైతులు అవగాహన పెంచుకోవాలంటున్న అధికారులు



కొమ్మల కత్తిరింపులను చూపుతున్న ఉద్యానవన శాఖాధికారులు

వి.కోట: ఏడాదిలో ఒకేసారి మాత్రమే పంటనిచ్చే మామిడిలో గతంతో పోల్చితే చీడపీడలు ఆశించి దిగుబడులు తగ్గడంతో రైతులు నష్టపోతున్నారు. చీడపీడల నివారణకు వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారుల సలహాలు–సూచనలు స్వీకరించి, యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి, ఆదాయం సాధ్యమేనని అధికారులు చెబుతున్నారు. మండలంలో దాదాపు 2వేల మంది రైతులు 4,300 ఎకరాల్లో మామిడితోటలు సాగుచేస్తున్నారు.

కొమ్మల కత్తిరింపులే మొదటి దశ

మామిడి తోటల్లో కోతల అనంతరం కొమ్మల కత్తిరింపు పనులు ఆగస్టులో మొదలు పెడితే మంచిది. అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలు, ఎండిన కొమ్మలతో పాటు చెట్ల మధ్యలో నిటారుగా, ఏపుగా పెరిగిన కొమ్మలనూ కత్తిరించి, గాలీ వెలుతురు ధారాళంగా ప్రసరించేలా చూడాలి. దీనివల్ల పూర్తి స్థాయి ఎండ తగలడంతో ఆకుల్లో కిరణజన్య సంయోగ క్రియ జరిగి పూత, పిందె దశల్లో వచ్చే వైరస్‌లను అరికట్టడమేకాక, దిగుబడుల శాతం పెరగడానికి దోహదపడుతుందని అధికారులు చెప్పారు.

కత్తిరింపుల అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తలు

కొమ్మల కత్తిరింపు అనంతరం పెద్ద కొమ్మల భాగానికి 10 గ్రాముల కాఫర్ ఆక్సీక్లోరైడ్ లీటర్ నీటికి కలిపిన ద్రావణం లేదా 1 శాతం బోర్డో మిశ్రమాన్ని పూయాలి.

- చెట్లు పూర్తిగా తడిచేలా 3 గ్రాములు కాఫర్ ఆక్సీక్లోరైడ్, 2 గ్రాముల కాఫర్ హైడ్రాక్సైడ్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- తోటలో ఎండిన కొమ్మలను కత్తిరించడంతో పాటు కాయ కోసిన కాండాలను తొలగించాలి.
- కొమ్మలు కత్తిరించిన వెంటనే తోటలను బాగా కలియదున్నాలి.
- చెట్లకు రెండు కిలోల యూరియా, ఐదు కిలోల సూఫర్ ఫాస్పేట్, 1500 గ్రాముల పొటాష్, వంద కిలోల పశువుల ఎరువు వేయాలి.
- దున్నకాల అనంతరం ఆగస్టు, సెప్టెంబర్‌లో జీలుగ, జనుము, పెసర, అలసంద, ఉలవ పంటలను సాగు చేసి ఆ పంటలు పూత దశకు వచ్చినప్పుడు వాటిని ట్రాక్టర్‌తో కలియదున్నడంతో పాటు పచ్చిరొట్ట ఎరువును అందించవచ్చు.
- 10 ఏళ్ల వయస్సు గల మామిడి తోటకు 100 కేజీల పశువుల ఎరువు, 2 కేజీల యూరియా, 5 కేజీల సింగిల్ సూపర్ ఫాస్పేట్ ఎరువులను వాడాలి.
- చెట్లకు ఎలాంటి ఎరువుల వాడినా చెట్ల మొదలు నుంచి 3–4 అడుగులు దూరంలో 30–40 సెంటీమీటర్ల గాడి తీయాలి.

గిట్టుబాటు ధర కల్పించాలి



మామిడి తోటలకు వేలాది రూపాయలు ఖర్చు చేసి కాయలను మార్కెట్‌కు తీసుకెళితే వ్యాపారస్తులు సిండికేట్ అయ్యి మోసం చేస్తున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకుని మామిడికి గిట్టుబాటు ధరలను కల్పించి ఆదుకోవాలి.
–భరత్, మామిడి రైతు, నెర్నిపల్లె, వి.కోట

అవగాహన కల్పించాలి



మామిడి తోటల పెంపకంలో రైతులకు అవగాహన కల్పించాలి. ఇటీవల కాలంలో ఆకులకు కూడా మచ్చలు వచ్చి, ఆకులు బూడిద రంగులో మారుతున్నాయి. వాటిని అలాగే వదిలేస్తే చెట్టు కొంతకాలానికే చనిపోతుంది. వీటి నివారణకు అధికారులు సరైన సూచనలు ఇవ్వాలి.
–రైతు గిరి, కుంభార్లపల్లె, వి.కోట

సరైన సమయంలో జాగ్రత్తలు



ఆగస్టు నెలలో కత్తిరింపులు పూర్తి చేయాలి. అధికారులు సూచనల ప్రకారం కొమ్మలను కత్తిరిస్తే చెట్లను ఎలాంటి చీడపీడలూ ఆశించవు. సరైన సమయంలో తోటలను దున్ని, తగినంత నీటిని అందిస్తే అధిక దిగుబడులు పొందవచ్చు. రైతులకు అందుబాటులో ఉండి వారికి అవగాహన కల్పిస్తాం.
–లక్ష్మీప్రసన్న, మండల ఉద్యానవనశాఖాధికారిణి, వి.కోట

అధ్వానంగా కుప్పం ఆర్టీసీ



కుప్పం బస్టాండులో మొరాయించిన కృష్ణగిరి సర్వీసు (ఫైల్)

- స్పేర్ పార్టుల కోసం ప్రతిపాదనలు
- చేతులెత్తేసిన ప్రభుత్వం
- ఆందోళన చెందుతున్న కుప్పం డిపో మెకానిక్కులు

కుప్పం: కుప్పం ఆర్టీసీ డిపో పరిస్థితి అధ్వానంగా మారింది. మారుమూల మూడు రాష్ట్రాల కూడలిలో ఉన్న కుప్పం ప్రాంతం నుంచి దూర ప్రాంతాలు, పొరుగు రాష్ట్రాలకు బస్సు సర్వీసులు నడుస్తుంటాయి. పనిచేయక మొరాయించిన బస్సులను డిపోకు వస్తే వాటిని రిపేర్లు చేయడానికి అవసరమైన విడిభాగాలు లేవని మెకానిక్స్ చేతులెత్తేస్తున్నారు. దీంతో కాలం చెల్లిన బస్సులతోనే నెట్టుకురావాల్సిన దుస్థితి నెలకొంది. నెల క్రితం రవాణ శాఖ మంత్రి కుప్పం ఆర్టీసీ డిపోను పరిశీలించి ఆదర్శ డిపోగా మారుస్తామని ప్రకటించారు. ఆదర్శ డిపో మాటేమోగానీ తొలుత విడిభాగాలు ఇవ్వండి మహాప్రభో అని సిబ్బంది కోరుతున్నారు.

విడిభాగాలు లేక రిపేర్లతోనే బస్సులు

కుప్పం ఆర్టీసీ డిపోలో 102 బస్సులు ఉన్నాయి. వీటిలో 92 బస్సుల వివిధ మార్గాల్లో నడుస్తున్నాయి. ఈ మధ్యకాలంలో పల్లె వెలుగు సర్వీసులు, అంతర్రాష్ట్ర సర్వీసులు మార్గమధ్యంలో మొరాయిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇక మరమ్మతులకు గురవుతున్న బస్సులు రిపేర్లు చేసేందుకు స్పేర్ పార్ట్స్ కోసం నెల క్రితం కుప్పం అధికారులకు పంపారు. 156 పరికరాలు కావాలని నివేదిక పంపితే కేవలం 16 పరికరాలు ప్రభుత్వం మంజూరు చేసింది. అసలే కుప్పంలో కాలం చెల్లిన బస్సులతో గ్రామీణ, అంతర్రాష్ట్ర సర్వీసులను అతి కష్టం మీద నడుపుతున్నారు. ఇలాంటి సమయంలో మరమ్మతులకు గురైన బస్సులను రిపేరు చేసేందుకు విడిభాగాలు లేక మెకానిక్స్ నిట్టూరుస్తున్నారు.

మొరాయిస్తున్న ఆర్టీసీ సర్వీసులు

కుప్పం డిపోలో నడుస్తున్న సర్వీసుల్లో 64 బస్సులు కాలం చెల్లినవే. ఇవి తరచూ మార్గమధ్యంలో మొరాయిస్తూ ప్రయాణికుల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. వెనుక మరో బస్సు వచ్చేంతవరకు నిరీక్షించాల్సి వస్తోంది. ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలోనే తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి సర్వీసు మొరాయించింది. దీంతో ప్రయాణికుల తోయడంతో స్టార్ట్ అయింది.

ఆలయ జీర్ణోద్ధరణకు సహకరించరూ!



బేలుపల్లెలో మాట్లాడుతున్న రామచంద్రనాయుడు

బైరెడ్డిపల్లె: మండలంలో బేలుపల్లె గ్రామ సమీపంలోని చోళరాజుల కాలంలో నిర్మించిన పురాతన ఆలయ జీర్ణోద్ధరణ పనులకు ప్రజలు సహకరించాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు రామచంద్రనాయుడు కోరారు. బేలుపల్లెలో ఆదివారం గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, గతంలో తిరుమల–తిరుపతి దేవస్థానం సహకారం కోసం దరఖాస్తు చేసుకున్నామని, స్పందించిన టీటీడీ అధికారులు పరిశీలన నిమిత్తం ఆలయం వద్దకు రెండు రోజుల్లో వస్తున్నట్లు చెప్పారు.ఆలయాభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ విస్తరణ కోసం గణేష్‌మొదలి, నారాయణమొదలి కుటుంబీకులు భూదానం చేశారు. అలాగే దశగ్రంధి శంకరశాస్త్రి రూ.2 లక్షలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో గిరిధరమూర్తి, నాగరాజునాయుడు, వెంకటప్ప, పంచాంగశర్మస్వామి, శల్యవైద్యులు లాల్‌బాషా, మణి, జయరాంఆచారి, నగేష్‌మొదలి. చక్రధర ఆచారి, వెంకటరమణ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు



ప్రమాణం చేస్తున్న మాల మహానాడు మండల కార్యవర్గం

చౌడేపల్లె: మాల మహానాడు మండల కార్యవర్గాన్ని ఏక గ్రీవంగా ఎన్నుకున్నట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు యమలా సుదర్శనం ఆదివారం తెలిపారు. స్థానిక శ్రీనివాసా కళ్యాణ మండపంలో ఎన్నికలు నిర్వహించారు. పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా కృపా మణి, మండల అధ్యక్షుడిగా కొత్తపల్లె మణి, గౌరవాధ్యక్షుడిగా ఆమినిగుంట మణి, ఉపాధ్యక్షులుగా రెడ్డిప్రసాద్, కూరపర్తి ఈశ్వర్, ప్రధాన కార్యదర్శిగా విజయ్, సహాయ కార్యదర్శులుగా సురేష్, రాములతో 20 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలియజేశారు. మాలల సంక్షేమంతోపాటు సమస్యల సాధకోసం సమష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతలు అశోక్, వీరభద్ర, శివయ్య, మల్లెల మోహన్, మనోహర్, హరి, మణి తదితరులు పాల్గొన్నారు.

చిరుద్యోగులపై వేధింపులకు స్వస్తి పలకాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నేతలు, చిరుద్యోగులు

చౌడేపల్లె: చిరుద్యోగులు, స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులకు స్వస్తి పలకాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఇదే విషయమైన ఆదివారం చౌడేపల్లెలో ర్యాలీ అనంతరం స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వీఓఏ, అంగన్‌వాడీ, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లపై కూటమి ప్రభుత్వ పాలనలో రాజకీయ వేధింపులు పెరిగిపోతున్నాయన్నారు. అధికారం అడ్డు పెట్టుకుని బెదిరింపులకు దిగి, వారిని విధుల నుంచి తొలగించడంలో ఔచిత్యమేమిటని ప్రశ్నించారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో చిరుద్యోగులను అధికారులు తొలగించడం తగదన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వ వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు. తొలగించిన సిబ్బందిని వెంటనే విధుల్లోకి చేర్చుకోవాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కేరళ రాష్ట్రం వయనాడ్ ప్రాంతంలో వరదలకు నష్టపోయిన కుటుంబాలకు ఆదుకోవడానికి విరాళాలు సేకరిస్తున్నామని, ప్రజలు దీనికి స్పందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి డాక్టర్ చంద్ర, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు





రైతుల నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ శివకుమార్. రైతులతో రిజిస్ట్రేషన్ చేయిస్తున్న ఏఓ రఖీబా, హెచ్‌ఓ

- పుంగనూరు ఏడీఏ శివకుమార్

పెద్దపంజాణి: రైతులకు రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు అందజేస్తున్నట్లు పుంగనూరు ఏడీఏ శివకుమార్ తెలిపారు. ఆదివారం మండలంలోని రాజుపల్లెకు దీనికి సంబంధించి నిర్వహించిన రైతుల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన బిందు, తుంపర సేద్యంపై రైతులకు అవగాహన కల్పించారు. నీరు, ఎరువుల ఆదాతో పాటు తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసి అధిక దిగుబడి పొందవచ్చన్నారు. బిందు సేద్యం పరికరాల కోసం సన్నకారు రైతులకు 90 శాతం, ఇతరులకు 70 రాయితీపై, అలాగే స్ప్రింక్లర్లను సన్నకారు రైతులకు 55 శాతం, ఇతరులకు 45 శాతం రాయితీపై అందజేస్తున్నట్లు తెలియజేశారు. రెవెన్యూ వెబ్‌ల్యాండ్‌లోని భూమి విస్తీర్ణం ఆధారంగా రాయితీ నిర్ణయిస్తామని చెప్పారు. పెద్దపంజాణి మండలంలో 900 హెక్టార్లకు బిందు సేద్యం పరికరాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు ఆధార్ కార్డు, 1బి, మొబైల్ నంబర్‌తో రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని సూచించారు. తదుపరి అప్పినపల్లె, చామనేరులో గ్రామాల్లో ఏఓ రఖీబా, హెచ్‌ఓ వరప్రసాద్ రైతుల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది విజయ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.